ఇండస్ట్రియల్ పార్క్‌ల్లో వసూళ్ల దందా!

- నిర్మాణం మొదలుకాగానే గద్దల్లా వాలుతున్న నేతల అనుచరులు
- లబోదిబోమంటున్న పారిశ్రామికవేత్తలు

హైదరాబాద్, సెప్టెంబర్ 16(నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తరువాత గత పదేండ్లలో దాదాపు 56 కొత్త పారిశ్రామికవాడలు ఏర్పాటయ్యాయి. ఆయా పారిశ్రామికవాడల్లో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారి కోసం ప్రభుత్వం సబ్సిడీ ధరకు భూములను కేటాయించింది. ఇందులో చాలా మంది ఇదివరకే పరిశ్రమలు ఏర్పాటు చేసుకోగా, ఇంకా అనేకమంది వివిధ కారణాలతో పరిశ్రమలు ఏర్పాటు చేసుకోలేకపోయారు. బ్యాంకుల నుంచి రుణ సహాయం, భాగస్వామ్యాలు కుదుర్చుకోవడం, సాంకేతికత సమకూర్చుకోవడం, మార్కెటింగ్ అంశాల వల్ల జాప్యం జరిగినట్టు చెప్తున్నారు. ఇవన్నీ సమకూర్చుకొని ఇప్పుడు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొస్తుంటే వారికి స్థానిక నేతల నుంచి బెదిరింపులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. తమకు కొంత సమర్పించుకుంటే తప్ప నిర్మాణాలు ముందుకు సాగవని పారిశ్రామికవేత్తలను భయాందోళనకు గురిచేస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా మేడ్చల్, పటాన్‌చెరు జోన్ల పరిధిలో ఈ సమస్య ఎక్కువగా ఉన్నది. చందన్‌వల్లి, కర్కపట్ల బయోటెక్ పార్క్, బండ తిమ్మాపూర్ జనరల్ పార్క్, ముప్పిరెడ్డిపల్లి, కుచారం, బండ మైలారం, తునికి బొల్లారం, వర్గల్, మందపల్లి, పాశమైలారం, శివనగర్ తదితర ఇండస్ట్రియల్ క్లస్టర్లలో స్థానిక నేతల అనుచరులు బెదిరింపులకు పాల్పడుతున్న ఆరోపణలున్నాయి.

అన్నీ సిద్ధం చేసుకున్నాక ఊహించని షాక్

టీజీఐఐసీకి బాధితుల నుంచి ఫిర్యాదులు అందుతున్నా.. వారు ఏమీ చేయలేక చేతులెత్తేస్తున్నారు. ఒక్కసారి భూమి విక్రయించిన తరువాత పరిశ్రమ ఏర్పాటు చేసుకునే బాధ్యత కొనుగోలుదారుపై ఉంటుందని, భూమికి సంబంధించి ఏమైనా న్యాయపరమైన, టైటిల్ పరమైన ఇబ్బందులు తలెత్తుతే మాత్రమే తాము జోక్యం చేసుకుంటామని టీజీఐఐసీ అధికారులు చెప్తున్నారు. నాయకులు పెట్టే ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిష్కరించుకోవాలని సలహా ఇస్తున్నారు.

పదేండ్లు సాఫీగా సాగిన పారిశ్రామికం

కేసీఆర్ హయాంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే భూముల కేటాయింపు జరగగా, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు స్వేచ్ఛగా పరిశ్రమలను ఏర్పాటు చేశారు. అటు అధికారులు కానీ, ఇటు నాయకులు గానీ వారిని ఇబ్బందులకు గురిచేసిన దాఖలాలు లేవు. పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ ఉండటంతో పారిశ్రామికవేత్తలను ఇబ్బంది పెట్టే సాహసం చేయలేదు.

అన్నా.. నెల దాటిందే!

మొదటిపేజీ తరువాయి...

ఉన్న నిర్మాణాలను కూల్చివేయాలని ఆగస్టు 8న సీఎం అన్నకు నోటీసులు ఇచ్చినా.. వాటిని ముట్టుకొనే ధైర్యం చేయటం లేదు.

నెల గడిచినా అటువైపు కన్నెత్తి చూడలె

కాంగ్రెస్, టీడీపీ పాలనలోనే చెరువులు అన్యాక్రాంతం అయినట్టు వచ్చిన ఆరోపణలకు అమర్ కో ఆపరేటివ్ సొసైటీ నిదర్శనం. కేబుల్ బ్రిడ్జి నిర్మాణంతో ప్రస్తుతం పర్యాటక కేంద్రంగా నిలిచిన దుర్గం చెరువు 85 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నది. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని ప్రాంతాలను పూడ్చివేసి కాలనీలు, రెసిడెన్షియల్ ప్రాజెక్టులను దశాబ్దాల క్రితమే నిర్మించారు. అలా ఏర్పడినవే అమర్ కో ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీ, కావూరి హిల్స్, కల్యాణ్‌నగర్, బృందావన్ కాలనీ, హెక్టార్ గార్డెన్ కాలనీలు. 2000లో వచ్చిన వరదలోనూ ఈ ప్రాంతంలోని పలు కాలనీలు నీట మునిగాయని ఇరిగేషన్, రెవెన్యూశాఖలు గుర్తించాయి. అప్పట్లోనే చెరువు భూముల్లో నిర్మించిన భవనాలను వ్యతిరేకిస్తూ కొందరూ కోర్టును ఆశ్రయించగా.. ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుమతుల్లేని భవనాలను ఇరిగేషన్, రెవెన్యూ, హూడా అధికారులు తొలగించారు. కానీ పెద్దల ప్రోద్బలం ముందు అధికారులు ముందుకు వెళ్లలేకపోయారు. దీంతో ఆక్రమణలపై చర్యలు నిలిచిపోయాయి. ఇరిగేషన్, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఆధారాలతో ఈ భూములు రెసిడెన్షియల్ కార్యాకలాపాలకు అనుకూలం కాదని, రీక్రియేషనల్ జోన్‌గా మార్చాలని అప్పట్లోనే హైకోర్టు ఆదేశించింది. అయినా ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ యథేచ్ఛగా నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. కూల్చివేతలతో హడావుడి చేసిన హైడ్రా.. సంపన్నుల భవనాలు, విల్లాలతో నిండిపోయిన అమర్ కో ఆపరేటివ్ సొసైటీకి మాత్రం నోటీసులతో సరిపెట్టింది. ఇప్పటికి నెల న్నర గడిచినా అటువైపు చూడటం లేదు.

హైడ్రా కూల్చివేతల్లో భాగంగా సున్నం చెరువు వద్ద అధికారులు కరెంట్ కట్ చేయడంతో సోలార్ లైట్ వెలుతురులో చదువుకుంటున్నామని సోలార్ లైట్ చూపిస్తున్న విద్యార్థి

- నోటీసుల్లేవ్.. అక్రమ నిర్మాణాలు కూల్చుడే అన్నరు!
- మరెందుకు సీఎం సోదరుడికి నోటీసులు ఇచ్చినరు?
- బుల్డోజర్లతో సామాన్యుల ఇండ్లు బూడిద చేసింద్రు!
- మరెందుకు సీఎం సోదరుడి ఇల్లు ఇంకా ముట్టుకోలె?
- చెరువు కట్టల దగ్గర ఏ కట్టడమున్నా తుక్కుతుక్కు చేసింద్రు!
- మరి సీఎం సోదరుడు ఉండే అమర్ సొసైటీ సంగతేంది?
- నోటీసులిచ్చి నెల గడిచిపాయె! చర్యల జాడ లేకపాయె!!
- హైడ్రా సారూ.. గిట్లుంటదా లెక్క?

సీఎం సోదరుడికీ నోటీసులు

అక్రమ నిర్మాణాల విషయంలో హైడ్రా తీరు మొదట్నుంచీ అనుమానంగా ఉన్నది. అమర్ కో ఆపరేటివ్ సొసైటీలో ఉండే సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడి ఇంటికి కూడా రెవెన్యూ అధికారులు నోటీసులు జారీచేశారు. కానీ ఆ తర్వాత అటు వైపు కన్నెత్తి చూడలేకపోయారు. కూల్చివేతలు దేవుడెరుగు.. కనీసం ఆయా నిర్మాణాల ఆక్రమణల విస్తీర్ణం కూడా తేల్చలేకపోయారు. సీఎం సోదరుడికీ నోటీసులు ఇచ్చామంటూ చెప్పుకున్నా కూల్చివేతల విషయంలో మాత్రం వెనకడుగు వేసినట్టు విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే హైడ్రా నడుస్తున్నదన్న ఆరోపణలు వస్తున్నాయి.

సామాన్యుడికే హైడ్రా దెబ్బలు

చెరువులు, కుంటలను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల విషయంలో దూకుడుగా వ్యవహరిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్.. సామాన్యుడు నిర్మించుకున్న ఇండ్లపైనే ప్రతాపం చూపుతుందనే విమర్శలను మూటగట్టుకుంటున్నారు. బిల్డర్లు, డెవలపర్లు చేసే తప్పిదాలతో సామాన్యుల కలల సౌధాలను కండ్ల ముందే కూలివేస్తున్నారు. గుండెలు బాదుకొని.. కంట నీరు తెచ్చుకుంటున్నా.. కనికరం లేకుండా కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు. కానీ రాజకీయ పలుకుబడితో చెరువులను చెరబట్టిన సంపన్నుల నిర్మాణాల జోలికిపోయే ధైర్యం మాత్రం చేయటం లేదు. ఎన్ కన్వెన్షన్ లాంటి నిర్మాణాలను కూల్చివేసి హడావుడి చేసినా.. అమర్ కో ఆపరేటివ్ సొసైటీ లాంటివి హైదరాబాద్‌లో లెక్కకు మించి ఉన్నాయి. కానీ ఇప్పటివరకు వాటిని గుర్తించింది లేదు. ఒకవేళ గుర్తించినా.. నోటీసులు చేరుతున్నాయి కానీ, బుల్డోజర్లు మాత్రం దరికి రావటంలేదు.

రంగనాథ్ దూకుడు ఎక్కడ?

నిబంధనలు అతిక్రమిస్తే ఎంతపెద్ద వారైనా, లీగల్ ఎదుర్కొని అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తామని బీరాలు పోయిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ సొసైటీ విషయంలో దూకుడు ఎక్కడ? అని హైదరాబాద్‌వాసులు ప్రశ్నిస్తున్నారు. జల వనరులను నిర్వీర్యం చేసిన సంపన్నవర్గాల నిర్మాణాలను ఎందుకు కూల్చడం లేదని నిలదీస్తున్నారు. నోటీసులు లేకుండానే నిర్మాణాలు కూల్చివేతలకు దిగుతున్న హైడ్రా.. సంపన్నులు, రాజకీయ నేతలు నిర్మించుకున్న భవంతుల విషయంలో అదే తీరుగా ఎందుకు స్పందించటం లేదని ప్రశ్నిస్తున్నారు. రాత్రికిరాత్రి.. పొద్దుపొద్దగాల.. ఎంతోమంది పేదల ఇండ్లను కూల్చివేసిన హైడ్రా.. నెల అవుతున్నా అమర్ కో ఆపరేటివ్ సొసైటీ నిర్మాణాలను కూల్చివేయడం లేదెందుకు? అని నిగ్గదీసి అడుగుతున్నారు.

19 వరకు దోస్త్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ గడువును అధికారులు పొడిగించారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నెల 19 వరకు అవకాశ మిచ్చినట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి తెలిపారు.

రెడ్ అలర్ట్ ప్రకటించిన 24 గంటల్లో కుంభవృష్టి

- 204.5 మిల్లీమీటర్ల వర్షం కురిస్తే అత్యంత భారీ వర్షం
- ఏడబ్ల్యూఎస్‌లతో వాతావరణ సమాచారంలో కచ్చితత్వం
- వాతావరణ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రావణి వెల్లడి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ):వాతావరణ హెచ్చరికలపై వాతావరణశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రావణి పలు విషయాలు వెల్లడించారు. ఎల్లో అలర్ట్, ఆరెంజ్ అలర్ట్, రెడ్ అలర్ట్‌ల జారీ, ఉష్ణోగ్రతలు, వర్షపాతాల లెక్కింపు, తుఫానులు, వర్షపాతాన్ని కొలవటం.. వాటి కోసం వాడే పరికరాల పనితీరును వివరించారు. 'వర్షపాతం వివరాలతో పాటు 4 నెలల పాటు నైరుతి రుతుపవనాలు దేశానికి ముఖ్యమైనవి. వీటిపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు అబ్జర్వేటిస్ (రెయిన్‌గోస్), శాటిలైట్ మీజర్‌మెంట్స్, మేఘాలు (క్లౌడ్స్) కీలకమైనవి. మేఘాలు రెడ్ కలర్‌లో ఉంటే వర్షం కురిసే అవకాశం ఉంటుంది. శాటిలైట్‌లో 3డీ మీజర్‌మెంట్స్‌ను తీసుకుంటాం. దీంతో వచ్చే 10 రోజుల్లో ఏ ప్రాంతంలో ఎక్కువ వర్షపాతం ఉంటుందో తెలుసుకోవచ్చు. మేఘాల దిశ ఆధారంగా వచ్చే 3 గంటల్లో ఎక్కడ వర్షపాతం కురుస్తుందనేది తెలుసుకోవచ్చు. పిన్ పాయింట్ లోకేషన్‌లో వచ్చే అరగంటలో ఎక్కడెక్కడ వర్షం కురుస్తుందనేది తెలుసుకునేలా 'రెయిన్ అలారం యాప్'కు అనుసంధానం చేశాం. ఇది దేశంలోని అన్ని రాడార్‌ల చిత్రాల సమాచారాన్ని సేకరిస్తుంది. దీని ద్వారా చుట్టూ 10 కిలోమీటర్ల పరిధిలో ఎటువైపు వర్షం కురుస్తుందనేది తెలుసుకోవచ్చని' వెల్లడించారు.

24 గంటల్లో ప్రభుత్వానికి నివేదిక

'వర్షపాతాన్ని కొలిచేందుకు ముఖ్యంగా రెయిన్‌గేజ్ పరికరాన్ని ఉపయోగిస్తాం. 204.5 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం కురిసే అవకాశం ఉంటే దానిని అత్యంత భారీ వర్షంగా పేర్కొని.. రెడ్ అలర్ట్‌గా ప్రకటిస్తాం. రెడ్ అలర్ట్ ప్రకటించిన ప్రాంతాల్లో 24 గంటల్లో కుంభవృష్టి వర్షం కురుస్తుంది. వెంటనే ప్రభుత్వానికి నివేదిక ఇస్తాం' అని డాక్టర్ శ్రావణి తెలిపారు. బంగాళాఖాతం, అరేబియా మహాసముద్రంలో ఏర్పడిన ఆవర్తనం ఒకటి, రెండు రోజుల్లోనే అల్పపీడనంగా మారుతుంది. ఇది కొనసాగితే వాయుగుండంగా మారుతుంది.

వర్షపాతం కొలిచే సమయాలు

తెలంగాణలో అధికారికంగా రామగుండం, నిజామాబాద్, హైదరాబాద్‌లో ఐఎండీ కేంద్రాలు ఉన్నాయని వాతావరణశాఖ అధికారి రామారావు తెలిపారు. 'ఈ మూడు ప్రధాన కేంద్రాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలు, ఎంఆర్వో కేంద్రాలతో పాటు 60 ఆటోమెటిక్ వెదర్ స్టేషన్లు (ఏడబ్ల్యూఎస్) ఏర్పాటు చేశాం. ప్రతిరోజు ఉదయం 8.30, సాయంత్రం 5.30 గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు, 12 గంటలు, 15 గంటలకోసారి వర్షపాతాన్ని లెక్కిస్తాం. జీహెచ్‌ఎంసీ సహకారంతో 140 కేంద్రాల నుంచి కూడా వాతావరణ సమాచారం సేకరిస్తున్నాం. రెయిన్‌గేజ్ ద్వారా వర్షపాతం గుర్తిస్తాం. 3 గంటలకు ఒకసారి లెక్కిస్తాం. ఎన్ని గంటలకు ఎంత వర్షపాతం నమోదైందని దీంతో తెలుస్తుం ది. స్టీవెన్ సన్‌స్క్రీన్ పరికరంతో ఉష్ణోగ్రతలను కొలుస్తాం. ఈ స్క్రీన్‌లో 4 థర్మామీటర్లు ఉంటాయని వెల్లడించారు.

జానీ మాస్టర్‌పై రేప్ కేసు

- ముంబై హోటల్‌లో లైంగికదాడి
- మతం మార్చుకుని వివాహం చేసుకోవాలని ఒత్తిడి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధిత యువతి.. కేసు నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో/బండ్లగూడ, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): సినీ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు నమోదైంది. బాధితురాలు, పోలీసుల కథనం ప్రకారం.. 2017లో ఒక టీవీ షోలో పాల్గొన్న మహిళా డ్యాన్సర్‌తో కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి జానీ మాస్టర్ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నట్టు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ముంబైలోని ఓ హోటల్‌లో తనపై లైంగిక దాడికి పాల్పడినట్టు తెలిపింది. నార్సింగి పోలీసులు జానీమాస్టర్‌పై 376,506,323 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. బాధితురాలిని పోలీసులు ఇంట్లోనే విచారించారు. అనంతరం ఆమె నార్సింగి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని మరిన్ని వివరాలను తెలిపింది. మతం మార్చుకుని వివాహం చేసుకోవాలని వేధిస్తున్నాడని చెప్పింది. ఒప్పుకోకుంటే అవకాశాలు రాకుండా అడ్డుకుంటానని బెదిరించినట్టు తెలిపింది. విచారణ తరువాత చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తా.. రిజెక్ట్!

- హైడ్రా ఎఫెక్ట్‌తో అప్లికేషన్ల తిరస్కరణల వెల్లువ
- ఇప్పటికే 25 లక్షల్లో 3 లక్షల దరఖాస్తుల నిరాకరణ
- తీవ్ర ఒత్తిడికి లోనవుతున్న అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): లే అవుట్ రెగ్యులరైజేషన్ (ఎల్ఆర్ఎస్)పై హైడ్రా ప్రభావం పడింది. జీహెచ్‌ఎంసీ పరిధిలో జరుగుతున్న హైడ్రా కూల్చివేతల నేపథ్యంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను అధికారులు తిరస్కరిస్తున్నారు. భవిష్యత్తులో తమకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు అధికారులు చిన్న చిన్న కారణాలతోనూ అప్లికేషన్లను రిజెక్ట్ చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలాలు సమీపంలో ఉన్నట్టు తెలిస్తే చాలు.. దరఖాస్తులను ఆమడదూరం పెడుతున్నారు. ఎఫ్‌టీఎల్ ఖరారు కాని చెరువులు, కుంటల పరిధిలోని అన్ని సర్వే నంబర్ల దరఖాస్తులను వెనక్కి పంపించేస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో షార్ట్ ఫాల్ డాక్యుమెంట్ పేరుతో దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, నాలాలపై నీటిపారుదలశాఖ అధికారులు ఎన్వోసీ ఇస్తేనే ముందడుగు వేస్తున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో దాదాపు ఏ చెరువుకూ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఖరారు చేయలేదు. కానీ ఎల్ఆర్ఎస్ పరిశీలిస్తున్న అధికారులు మాత్రం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోకి వస్తుందేమోనన్న ఉద్దేశంతో ఎన్వోసీ కావాలని అడుగుతున్నారు. దీంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ముందుకు కదలటం లేదు. కొన్ని నిర్మాణాలకు అనుమతులు ఇచ్చినందుకు పలువురు అధికారులపై కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో తాము ఎల్ఆర్ఎస్‌కు ఓకే చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉన్నదన్న ఆందోళనతో తిరస్కరించడం లేదా షార్ట్‌ఫాల్ డాక్యుమెంట్ రిమార్క్ చెప్తూ చేతులు దులుపుకుంటున్నారు. కొన్ని లేఅవుట్లలోని ప్లాట్లకు ఇప్పటికే ఎల్ఆర్ఎస్ క్లియరెన్స్ ఇచ్చినా.. అదే లేఅవుట్‌లోని మిగతా ప్లాట్లకు క్లియరెన్స్ ఇవ్వటానికి అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్ కోసం 25.70 లక్షల దరఖాస్తులు రాగా, 65 వేల దరఖాస్తులను ఆమోదించారు. దాదాపు 3 లక్షల అప్లికేషన్లను తిరస్కరించడం, షార్ట్‌ఫాల్ డాక్యుమెంట్స్ పేరుతో ఆమోదించలేదు. మరోవైపు, ఎల్ఆర్ఎస్ ద్వారా ఖజానాను నింపుకోవచ్చని ప్రభుత్వం ఆశపడింది. కానీ, ఆ ఆశకు హైడ్రా గండికొడుతున్నది. అంటే.. పరోక్షంగా ప్రభుత్వం కూడా ఇరకాటంలో పడుతున్నది. ఈ పర్యవసానాల నేపథ్యంలో అటు ప్రజలు, ఇటు ప్రభుత్వం మరికొన్ని నెలలు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది.

టీచర్ల కొరత తీర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

- విద్యాశాఖ వివరణ

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని మాడల్ స్కూళ్లలో టీచర్ల కొరతను తీర్చేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలంగాణ మాడల్ స్కూల్స్ డైరెక్టర్ శ్రీనివాసాచారి ఒక ప్రకటనలో తెలిపారు. '17 మాడల్ స్కూళ్లలో జీరో టీచర్లు' శీర్షికతో 'నమస్తే తెలంగాణ'లో సోమవారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన సోమవారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్రంలోని 98 స్కూళ్లకు ప్రిన్సిపాళ్లు లేరు.. ఆయా పాఠశాలల్లో సీనియర్ టీచర్‌కు ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగించడంతో పాటు, పీజీటీ, టీజీటీ టీచర్లు లేనిచోట అవర్లీ బేస్డ్ టీచర్లను తీసుకుంటామని తెలిపారు. ఇక ఇటీవల నిర్వహించిన బదిలీలతో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని సిర్పూరు(యూ), మెదక్ జిల్లాలోని రేగోడు మాడల్ స్కూళ్లలో టీచర్లు లేరని ఆయన పేర్కొన్నారు.

ఏఐఎఫ్‌టీవో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పింగిలి శ్రీపాల్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాష్ట్రానికి చెందిన పింగిలి శ్రీపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనను ఆది, సోమవారాల్లో జరిగిన ఏఐఎఫ్‌టీవో జాతీయ సాధారణ కౌన్సిల్ సమావేశాల్లో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. 2021-24 వరకు జాతీయ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూపీఎస్‌ను రద్దుచేసి, పాత పెన్షన్‌ను పునరుద్ధరించే వరకు అన్ని ఉపాధ్యాయ సంఘాలను ఏకంచేసి పోరాడుతామని తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షురాలు గీత, జాతీయ ముఖ్య సలహాదారు, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మహిళా కార్యదర్శులు త్రివేణిదేవి, విజయలక్ష్మి, ఆనంద్‌రెడ్డి, రామేశ్వర్, రజిత, జ్యోతి హాజరయ్యారు. ఇక రాష్ట్రానికి చెందిన మరో ఉపాధ్యాయ సంఘం నేత మహమ్మద్ అబ్దుల్లా ఏఐఎఫ్‌టీవో సెక్రటరీగా ఎన్నికయ్యారు.

అటకెక్కిన 'ఎక్సైజ్' ఫైల్

- అతీగతీలేని కొత్త పోలీస్‌స్టేషన్ల ఏర్పాటు
- గత ప్రభుత్వ నిర్ణయాన్ని తొక్కిపెట్టిన రేవంత్ సర్కార్
- పని భారాన్ని తగ్గించాలని కోరుతున్న ఆబ్కారీ సిబ్బంది

హైదరాబాద్, సెప్టెంబర్ 16 (నమస్తే తెలంగాణ): ఎక్సైజ్ శాఖ ద్వారా వేల కోట్ల ఆదాయం పొందుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ విభాగానికి వనరుల కల్పనను మాత్రం అటకెక్కించింది. ఎక్సైజ్ శాఖ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుతూ, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కొత్త ఎక్సైజ్ పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న గత ప్రభుత్వ నిర్ణయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తొమ్మిది నెలలుగా పట్టించుకోవడం లేదు. ఏడాదికి రూ. 200 కోట్లకు పైగా ఆదాయం ఉన్న ఎక్సైజ్ పోలీసుస్టేషన్లలో నిర్వహణ ఇబ్బందిగా ఉందని క్షేత్రస్థాయి నుంచి ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో వాటిని రెండు స్టేషన్లుగా విభజించాలని గత కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు 2022 ఆగస్టులో ఉత్తర్వులు జారీ చేసింది. ఆ మేరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 13 ఎక్సైజ్ పోలీసుస్టేషన్లు, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక స్టేషన్‌ను కొత్తగా ఏర్పాటు చేయవచ్చని ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయం నివేదికలు రూపొందించింది. ఇందుకు ఆర్థిక శాఖ నుంచి కూడా అనుమతులు వచ్చాయి. శేరిలింగంపల్లి, బాలానగర్, కూకట్‌పల్లి, మల్కాజిగిరి, ఘట్‌కేసర్, హయత్‌నగర్, సరూర్‌నగర్, శంషాబాద్, పటాన్‌చెరు, సికింద్రాబాద్, హన్మకొండ ఎక్సైజ్ పోలీసు స్టేషన్లను రెండుగా విభజించాలని సూచిస్తూ కమిషనర్ కార్యాలయం నివేదికలు సిద్ధం చేసింది. ఆ నివేదికను 2023 డిసెంబర్‌లో ఎక్సైజ్ అధికారులు ప్రభుత్వ అనుమతి కోసం పంపారు. ఈ లోగా బీఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఇక అప్పటి నుంచి ఫైల్ అటకెక్కింది.

నిరుద్యోగులకు అవకాశాలు వచ్చేవి

కొత్త ఎక్సైజ్ పోలీసుస్టేషన్లకు అనుమతించి ఉంటే.. ప్రతి స్టేషన్‌కు ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, కనీసం 10 మంది కానిస్టేబుళ్లు మొత్తం 15 మందికి, 14 స్టేషన్లలో కలిపి కనీసం 210 మంది నిరద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కేవి. సర్వీస్‌లో ఉన్న వారికి పదోన్నతులు వచ్చేవి. ఉద్యోగ బదిలీలు జరిగేవి. ఒక్క సంతకంతో పూర్తయ్యే పనిని కాంగ్రెస్ ప్రభుత్వం తొమ్మిది నెలలుగా తొక్కి పెడుతున్నది. కొత్త ఎక్సైజ్ పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేస్తే కేసీఆర్‌కు పేరు వస్తుందన్న ఏకైక కారణంతోనే ఫైల్‌ను పక్కన పెట్టారని ఎక్సైజ్ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కొత్త పోలీసుస్టేషన్లను ఏర్పాటు చేసి పని భారాన్ని తగ్గించటంతోపాటు, పదోన్నతులు, బదిలీలకు మార్గం సుగమం చేయాలని కోరుతున్నారు. దీనిపై ఎక్సైజ్ కమిషనర్ వివరణ కోసం ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కులగణన మార్చ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

25న కులగణన మార్చ్

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

ఖైరతాబాద్, సెప్టెంబర్ 16 : బీసీ సంక్షేమ సంఘం, బీసీ కులసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 25న సమగ్ర కులగణన, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల పెంపు డిమాండ్‌తో మిలియన్ మార్చ్ తరహాలో హైదరాబాద్‌లో లక్షలాది మందితో 'కులగణన మార్చ్' నిర్వహించనున్నట్టు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్ చారి, కన్వీనర్ బాలగాని బాలరాజుగౌడ్, వేముల వెంకటేశ్, మణిమంజరితో కలిసి కులగణన మార్చ్ పోస్టర్ ఆవిష్కరించారు. కులగణనపై కేంద్రంలో రాహుల్ గాంధీ ఓ మాట మాట్లాడుతుండగా, రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరిస్తుండడం కాంగ్రెస్ కుటిల నీతిని తెలియజేస్తుందని మండిపడ్డారు. కులగణనపై 48 గంటల్లోపు సీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇంటికొకరు తరలిరావాలని పిలుపునిచ్చారు.

జడ్జి పోస్టుల్లో బీసీలకు అన్యాయం: ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, సెప్టెంబర్16 (నమస్తే తెలంగాణ) : జూనియర్ సివిల్ జడ్జి, డిస్ట్రిక్ట్ జడ్జి పరీక్షలు రాసిన బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని, అందుకు ప్రస్తుత నోటిఫికేషన్‌లోని నిబంధనలే అడ్డంకిగా మారాయని, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. ప్రభుత్వం వెంటనే నిబంధనలు సవరించి ఓబీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జూనియర్ అడ్వకేట